క్లుప్తంగా

మాజీ డిప్యూటీ సీఎం బూడికి ఘన స్వాగతం పలకాలి

● ఎంపీపీ వెంకట రాజారామ్ పిలుపు



మాడుగుల : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా శనివారం మాడుగుల వస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు ఘనస్వాగతం పలకాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక వేంకటేశ్వరాలయానికి ఉదయం 9 గంటలకు హాజరవ్వాలన్నారు. మాజీ ఎంపీపీ రామ ధర్మజ, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీడికాడ : జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు శనివారం ఉదయం మాడుగుల రానున్నారని, వేంకటేశ్వరాలయంలో పూజలు చేస్తారని మండల పార్టీ అధ్యక్షుడు రాజుబాబు తెలిపారు. పార్టీ నేతలు హాజరై ఆయనకు ఘన స్వాగతం పలకాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ఉషశ్రీ



ఎంపీడీవో ఉషశ్రీకి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం ఎంపీడీవోగా కె.ఉషశ్రీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా కోలాకి మండలం నుంచి బదిలీపై నర్సీపట్నం వచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న ఎంపీడీవో జయమాధవి, రాంబిల్లి మండలానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ఉషశ్రీకి కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఏపీవోగా ఈశ్వర్రావు బాధ్యతల స్వీకారం



రోలుగుంట : రోలుగుంట ఏపీవోగా పూతి ఈశ్వర్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని ఏపీవోగా పని చేసిన కోసూరి సూర్యామణి నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఇప్పటి వరకూ వి.మాడుగులలో విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్రావును ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విధుల్లో చేరారు.

రక్తదానం.. ప్రాణదానమే..



విద్యార్థులతో ఎమ్మెల్యే రాజు

చోడవరం రూరల్ : రక్తదానం చేయడమంటే ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడమే అని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, విశాఖపట్నం న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విశాఖ న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు 80 మంది నుంచి రక్తసేకరణ చేశారు.

చెత్త ట్రాక్టరు తొట్టె ప్రారంభం



చెత్త ట్రాక్టరు తొట్టెను ప్రారంభిస్తున్న సర్పంచ్ సంజీవిరావు, వార్డు సభ్యులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్త ట్రాక్టరు తొట్టెను శుక్రవారం గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ప్రారంభించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల కోసం గత ప్రభుత్వ హయాంలో చెత్త ట్రాక్టరు మంజూరు కోరుతూ అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు వినతి అందజేయగా ట్రాక్టరు ఇంజిన్‌ను మంజూరు చేశారని, తాజాగా పంచాయతీ నిధులు రూ.1.70 లక్షలతో తొట్టెను సమకూర్చుకున్నట్టు సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ గెంజి రాజేశ్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలకే దిక్కులేదా..?

● ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై జనం ఆగ్రహం



బంగారుమెట్ట జంక్షన్‌లో పెద్ద గొయ్యి మీదుగా అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

బుచ్చెయ్యపేట : జిల్లా కలెక్టర్ ఆదేశాలంటే ఆర్‌అండ్‌బీ అధికారులకు లెక్కలేనట్లుంది. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో బంగారుమెట్ట జంక్షన్ వద్ద రోడ్డు మధ్య పెద్ద గొయ్యి పడింది. ఈ నెలలో కురిసిన వర్షాలకు వడ్డాది పెద్దేరు, విజయరామరాజుపేట తాచేరు వంతెనలపై నుండి నీరు ప్రవహించింది. డైవర్షన్ రోడ్లు దెబ్బతినడంతో పరిశీలించడానికి 9వ తేదీన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మండలానికి వచ్చారు. బంగారుమెట్ట జంక్షన్‌లో రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గొయ్యిలో చేరిన వర్షం నీరును చూసి కలెక్టర్ కారు ఆపి గొయ్యిలో నీరు బైటకు పోయేలా చేసి గొయ్యిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్‌అండ్‌బీ, మండల, పంచాయితీ అధికారులు కాస్త హడావిడి చేసి తూతూ మంత్రంగా గోతిలో నీరు బైటకు పోయేలా చేసి కొద్దిగా గ్రావెల్ వేసి వదిలేశారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డు అవడంతో ఈ గొయ్యి మరింత పెరిగి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వయాన జిల్లా కలెక్టర్ గొయ్యిని పూడ్చాలని ఆదేశాలిచ్చినా అధికారులు తూతూ మంత్రం పనులు చేయడంపై స్థానికులు మండి పడుతున్నారు. ఇటీవల ఈ గొయ్యి వద్దే కోడూరు నుండి బంగారుమెట్ట పామాయిల్ ఫ్యాక్టరీకి పామాయిల్ గెలలతో వస్తోన్న ట్రాక్టర్ గోతిలో తిరగబడి బోల్తా పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం వైపు వెళ్లే ముఖ్య కూడలి బంగారుమెట్ట జంక్షన్‌లో గొయ్యిని పూడ్చి ప్రమాదాలు తప్పించాలని పలువురు కోరుతున్నారు.

పేదలకు సంజీవనిలా ఉపాధి పథకం

● దుర్వినియోగాన్ని సహించం
● ఎంపీపీ శ్రీనివాసరావు, డ్వామా ఏపీడీ రోజారాణి



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు

రోలుగుంట : ఉపాధి పథకం పేదోడికి సంజీవని లాంటిదని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలే గాని దుర్వినియోగాన్ని సహించలేమని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, డ్వామా ఏపీడీ రోజారాణి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో శుక్రవారం 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఏపీవో కోసూరి సూర్యామణి నిర్వహించారు. ఇక్కడ 2023 ఏప్రిల్ 1 తేదీ నుంచి మార్చి 31 2024 తేదీ వరకూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మండలంలో గల 24 పంచాయతీల పరిధిలో ఉపాధి పనుల నిర్వహణ కోసం నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌తో పాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఎస్ఏ పనులకు ఆ శాఖ నుంచి రూ.17.56 కోట్లు నిధులు మంజూరై పనులు జరిగాయి.

ఆయా పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. పలు గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులు తీసుకుని, పనులకు సంబంధించిన నివేదికలు తయారు చేసి శుక్రవారం ప్రజావేదికలో డ్వామా పీడీ సమక్షంలో చదివి వినిపించారు. కొన్ని పంచాయల్లో పనికి హాజరుకాని వారికి మస్తర్లు వేశారని, కొన్ని గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించిన పని వివరాల బోర్డులు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దీనిపై వీఆర్పీలు, సాంకేతిక సహాయకులను వివరణ కోరారు. ఎం.కె.పట్నం వీఆర్పీ దేముడుబాబు, కొండపాలెం వీఆర్పీపై ఆయా గ్రామాల నుంచి అధికంగా ఫిర్యాదులు రావడంతో పీడీ వాటిపై విచారణ చేయాలని ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్టేట్ కౌన్సిలర్ బూరి బాబూరావు, విజిలెన్స్ విభాగం నుంచి దివ్య, సాంకేతిక సహాయకులు రాము, దినేష్ , ఆశ్రయ, వీఆర్పీలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వడ్డాదిలో దసరా ఉత్సవరాట



వడ్డాదిలో దసరా ఉత్సవ రాట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట : దసరా పండగ మహోత్సవం సందర్భంగా శుక్రవారం వడ్డాది బ్రాహ్మణ వీధిలో దుర్గాదేవి అమ్మవారి ఉత్సవరాట వేశారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బ్రాహ్మణవీధిలో పలువురు భక్తులు, పేరంటాల నడుమ శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవరాట వేసి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం బ్రాహ్మణవీధిలో అమ్మవారిని నెలకొల్పి శరన్నవరాత్రి మహోత్సవాలు, అన్న సమారాధనలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



మాడుగులలో దసరా ఉత్సవాలకు రాట వేస్తున్న భక్తులు

మాడుగులలో దసరా ఉత్సవ రాట

మాడుగుల : మాడుగులలో సివిల్ ఆర్‌టీసీ అండ్ ఆటో ఓనర్స్ మోటార్ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో అతి వైభవంగా నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం ఉదయం రాట ఉడుపు ఉత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేయడానికి రాట ఉడుపు ఉత్సవం నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, శ్రీనాదు శ్రీనువాసరావు, దంగేటి సూర్యారావు, మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

చోడవరం రూరల్ : భవిష్యత్‌లో స్వర్ణాంధ్ర 2047 పథకంలో భాగంగా మండలంలోని పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకురావలసిన మార్పులను గురించి మండల స్థాయిలో పలువురు విద్యార్థులు తమ వ్యాసాలు, వక్తృత్వంలో తెలిపారు. మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం, మండల నోడల్ ప్రధానోపాధ్యాయుడు వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన పోటీలకు మండలంలోని 17 ఉన్నత పాఠశాలల నుంచి అక్కడ విజేతలైన 35 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో వ్యాసరచనలో లక్ష్మీపురం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.రమేష్, వక్తృత్వంలో జన్నవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.బిందుమాధవి, డిబేట్‌లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె.మౌనిక విజేతలుగా నిలిచారు. వీరంతా శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారు. న్యాయ నిర్ణేతలుగా సన్నిబాబు, ఇస్మాయిల్, మణిమాల, రమేష్, సుష్మాదేవి, ఆర్.లక్ష్మి, ఎస్.కృష్ణ, గంగాధర్ వ్యవహరించారు. పోటీల నిర్వహణలో సీఈఆర్పీలు కె.వి.మహాలక్ష్మినాయుడు, రవిశంకర్ సహకరించారు.



పోటీలకు హాజరైన విద్యార్థులతో న్యాయ నిర్ణేతలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం : భగత్‌సింగ్ జయంతిని సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డ్రగ్స్, మద్యం, సిగరెట్ ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిఐటీయు జిల్లా నాయకులు రాజు, యుటీఎఫ్ నాయకులు చిట్టియ్య, డివిజన్ నాయకులు రాజు, భూషణ్, మోహన్‌సాయి భార్గవ్ పాల్గొన్నారు.

రోలుగుంట : మండల స్థాయిలో 2045 స్వర్ణాంధ్రప్రదేశ్ రాబోవు ఐదు సంవత్సరాల్లో విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలపై రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. రోలుగుంట హైస్కూల్ నుంచి వై.అమృత(ప్రథమ), వి.వాసవి(ద్వితీయ), కేజీబీవీ నుంచి ఎన్నికల అంశంపై ఎల్.హర్షిత(ప్రథమ), కుసుర్లపూడి నుంచి వక్తృత్వ పోటీలో జి.రామ్మోహన్ (ప్రథమ) ఎస్.అక్షయ(ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. వారికి ఎంఈవో జాగ్గారావు, హెచ్ఎం ప్రసాద్, అప్పన రాంబాబు ధ్రువపత్రాలు అందజేశారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కె.కోటపాడు : చదువులతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల నియోజకవర్గ స్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడాపోటీలను శుక్రవారం చౌడువాడ హైస్కూల్లో నిర్వహించారు. అండర్-14, 17 బాలుర విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలతో పాటు అథ్లెటిక్స్ పోటీలు జరిపారు. పోటీలకు హాజరైన పలు పాఠశాలల క్రీడాకారులను ఎమ్మెల్యే బండారు పరిచయం చేసుకొని, క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, హెచ్ఎం సన్నిబాబు, సర్పంచ్ ఎరుకునాయుడు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

నర్సీపట్నం : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. నియోజకవర్గ స్థాయి బాయ్స్ స్కూల్ గేమ్స్‌ను నర్సీపట్నం బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను సీఐ రేవతమ్మ, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షెటిల్, చెస్, యోగ పోటీల్లో నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవకపాలెం మండలాల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ శ్రీనివాసరావు తెలిపారు.



షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రేవతమ్మ

జ్వరాల నివారణకు దోమతెరలు

నాతవరం : దోమతెరలు జాగ్రత్తగా ఉపయోగిస్తే రోగాలు రాకుండా కాపాడుకోవచ్చునని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స నాతవరం సర్పంచ్ గోలగాని రాణి అన్నారు. మండలంలో గల 34 గిరిజన గ్రామాలకు పాడేరు ఐటీడీఏ ద్వారా 2502 దోమతెరలు వచ్చాయి. వాటిని శుక్రవారం ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



లబ్ధిదారులకు దోమతెరలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి

ఎ.కొత్తపల్లిలో పారిశుధ్య చర్యలు

దేవరాపల్లి: ఏ. కొత్తపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి టి. పవన్, సచివాలయ కార్యదర్శి టి. కొండలరావు ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు పర్యవేక్షించారు.

నూతన తహసీల్దార్ల బాధ్యతల స్వీకారం



గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావు



దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి

గొలుగొండ : గొలుగొండ తహసీల్దార్‌గా పి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బుచ్చియ్యపేట తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకి వచ్చారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల సర్వేయర్‌గా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చినబాబు యలమంచిలి బదిలీపై వెళ్లారు.

చోడవరం : చోడవరం తహసీల్దార్‌గా ఎ.ఎస్.రామారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర సచివాలయం నుంచి బదిలీపై రామారావు ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తిరుమలబాబు కోటవురట్ల మండలానికి బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రామారావు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం స్వాగతం పలికారు.

దేవరాపల్లి : దేవరాపల్లి తహసీల్దార్‌గా పి.లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, సర్వేయర్లు, వీఆర్‌ఏలు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టరేట్‌లో కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేసిన ఆమె బదిలీపై తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. దేవరాపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా కె.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వచ్చిన అప్పారావుకు సిబ్బంది, వీఆర్‌వో, వీఆర్‌ఏలు శుభాకాంక్షలు తెలియజేశారు. డీటీ అప్పారావు గతంలో దేవరాపల్లి ఆర్‌ఐగా, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించారు. ఇక్కడ డీటీగా పనిచేసిన ఆనంద్ పాయకరావుపేట డీటీగా బదిలీ అయ్యారు.



మాడుగుల మోదకొండమ్మ సన్నిధిలో తహసీల్దార్ రమాదేవి

మాడుగుల రూరల్ : మాడుగుల నూతన తహసీల్దారుగా నియమితులైన కె. రమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన పి.వి.రత్నం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ ప్రొటెక్షన్ పర్యవేక్షణాధికారిగా బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దారు రమాదేవిని ఆమె చాంబర్‌లో హెచ్‌డీటీ లక్ష్మయ్య, ఎన్నికల తహసీల్దారు రాజా, వీఆర్‌ఏలు దోని చినఅప్పారావు, చిలుకు, ఆఫీసు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఆమె అంతకుముందు మోదకొండమ్మను దర్శించుకున్నారు.



బుచ్చెయ్యపేట తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట : మండల తహసీల్దార్‌గా ఎం.లక్ష్మి శుక్రవారం విధుల్లో చేరారు. దేవరాపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె బుచ్చెయ్యపేట తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్ శ్రీనివాసరావు అనకాపల్లి బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన తహసీల్దార్‌కు ఆర్ఐ శ్రావణ్, వీఆర్వోలు సుధాకర్, ఎర్రయ్య, సిబ్బంది అభినందనలు తెలిపారు.

నూతన డీటీ బాధ్యతల స్వీకరణ

మాకవరపాలెం : డిప్యూటీ తహసీల్దార్‌గా సోమశేఖర్ విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డీటీ శంకర్రావుకు రోలుగుంటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రోలుగుంటలో పనిచేస్తున్న సోమశేఖర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

నాతవరం డీటీగా రాజు



నాతవరం: తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా టి.వి.ఎల్ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డీటీ సుధాకర్‌ను పరవాడకు, విశాఖ ఏపీఐఐసీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాజును ఇక్కడకు బదిలీ చేశారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా బూడి నియామకంపై హర్షం

దేవరాపల్లి: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును నియమించడం పట్ల దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. బూడి నియామకం పట్ల ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, జెడ్పీటీసీ సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ గంగాభవానీ, యువజన అధ్యక్షుడు సూరినాయుడు, జేసిఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, కొప్పల వెలమ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లలితానాయుడు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి నారాయణమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పశు సంరక్షణపై శ్రద్ధ చూపాలి

చోడవరం రూరల్ : రైతులు పశు పోషణతో పాటు వాటి ఆరోగ్య రక్షణ పట్ల మెలకువతో ఉన్ననాడే పశు సంపద పెంపొందుతుందని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రామ్మోహనరావు, పశుగణాభివృద్ధి సంఘ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాదరావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌లు తమ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు

ప్రమాద స్థాయిలో తాండవ నీటి మట్టం

● పరిసర గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి
● తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ

నాతవరం : తాండవ రిజర్వాయరు నీటి మట్టం ప్రమాద స్థాయిలో ఉందని ఏసమయంలోనైన స్పిల్‌వే గేట్లు ద్వారా నదిలోకి విడుదల చేస్తామని ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. ఆమే శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 377.9 అడుగులకు చేరిందని ఇన్ ఫ్లో నీరు ఎగువ ప్రాంతం నుంచి 500 క్యూసెక్కులు దాటి వస్తుందన్నారు తాండవ ప్రధాన గేట్ల ద్వారా పంట కాలువలు ద్వారా ఆయకట్టుకు 500 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బట్టి పరిశీలిస్తే ఏలాంటి సమస్య లేదన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఇన్ ఫ్లో నీరు ప్రాజెక్టులోకి పెరిగితే 378 అడుగులు దాటితే స్పిల్‌వే గేట్లు ద్వారా తాండవ నదిలోకి నీటిని విడుదల చేస్తామన్నారు. రాత్రి సమయంలో తాండవ నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాల ప్రజలు, పశువులు నదిలోకి దిగరాదని హెచ్చరికలు జారీ చేశామన్నారు. "అదే విధంగా నాతవరం, కోటనందూరు, తుని మండలాల అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చామన్నారు.

కె.జె.పురంలో 20 సోలార్ లైట్లు ఏర్పాటు

మాడుగుల రూరల్ : అనకాపల్లి మాజీ పార్లమెంటు సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి సహకారంతో కె.జె.పురం గ్రామంలో 20 సోలర్ లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల అభ్యర్థన మేరకు గ్రామంలో అవసరమైన చోట్ల ఈ సోలర్ లైట్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామంలో గల శ్మశానవాటికలో మూడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జంక్షన్‌లో ఒక్కో లైటును ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణబాబు, వార్డు సభ్యులతో పాటు పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఆడారి గణేశ్, పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యాధికారి కె.లీలా ప్రసాదు, సిబ్బంది పాల్గొన్నారు.



కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేస్తున్న సోలార్ లైటు స్తంభం వద్ద సర్పంచ్ రమణబాబు

ఆర్టీసీ కండక్టర్‌కు ప్రయాణికుల ఆత్మీయ సత్కారం

దేవరాపల్లి: అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రయాణికులతో స్నేహ పూర్వకంగా మెలిగిన ఆర్టీసీ కండక్టర్‌కు అరుదైన గౌరవం లభించింది. మద్దిలపాలెం డిపోకు చెందిన సిహెచ్.రాజేశ్వరరావు దేవరాపల్లి 12డి బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బస్సులోని ప్రయాణికులతో కుటుంబ సభ్యుడి మాదిరిగా కలిసిపోయి ప్రయాణికుల మనస్సును దోచుకున్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాజేశ్వరరావు ఆఖరి రోజు శుక్రవారం విధులకు హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ప్రయాణికులు దేవరాపల్లిలో శుక్రవారం పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కండక్టర్‌గా కాకుండా కుటుంబ సభ్యుడిగా తమతో కలిసిపోయిన రాజేశ్వరరావు సేవలు మరులేమని పలువురు ప్రయాణికులు అతడిపై ప్రశంసల జల్లు కురిపించారు. అనంతరం కండక్టర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రయాణికులు తనపై చూపిన ప్రేమాభిమానాలను జీవితంలో మర్చిపోలేనన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ రుణపడి ఉంటానన్నారు.



దేవరాపల్లిలో ఆర్టీసీ కండక్టర్ రాజేశ్వరరావును సత్కరిస్తున్న ప్రయాణికులు

మాజీ మంత్రి బలిరెడ్డికి ఘన నివాళి



బలిరెడ్డి సత్యారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యారావు, పార్టీ నాయకులు

చోడవరం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దివంగత బలిరెడ్డి సత్యారావు ఆరో వర్ధంతిని ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శుక్రవారం నిర్వహించారు. ఆయన స్వగ్రామం పీఎస్‌పేటలో బలిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బలిరెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, పీఏసీఎస్ అధ్యక్షులు శానాపతి సత్యారావు, దన్నిన వెంకట్రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకపలి ఆనందీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, జిల్లా ప్రతినిధి హారిక రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తమ్మునాయుడు, పాల్గొన్నారు.